


జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజలకోసం
కరీంనగర్
జగిత్యాల - రాజన్న సిరిసిల్ల -పెద్దపల్లి
శుక్రవారం 23-1-2026


# 100శాతం పన్నులు వసూలు చేయాలి..

**రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ**

**గోదావరిఖని , జనవరి 22(ప్రజా జ్యోతి):** ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ శ్రీ ఆదేశించాడు.వార్డు అధికారులు, సహాయకులు ,సిబ్బందితో గురువారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ భారీ బకాయలు ఉన్న వ్యక్తులు,సంస్థలపై మొదటగా దృష్టి సారించాలన్నారు.నీటి సరఫరా ఛార్జీలు,ట్రేడ్ లైసెన్స్ రుసుం కూడా లక్ష్యం ప్రకారం వసూలు చేయాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల డేటా క్షేత్ర స్థాయిలో సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు.

మిగతా 6లో...



# మున్సిపోల్స్‌కు బీజేపీ సై

**కరీంనగర్ బ్యూరో, జనవరి 22 :** భారతీయ జనతా పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలోని కరీంనగర్ కార్పొరేషనతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలపై కాషాయ జెండాను ఎగురవేయాలనే లక్ష్యంతో ఆ పార్టీ ముందుకు సాగుతున్నది. బండి సంజయ్‌కుమార్ ఈ మున్సిపాలిటీలు, కార్పొరేషనలో గల విజయావకాశాలను, అభ్యర్థులుగా ఎవరిని నిలిపితే బాగుంటుందనే విషయం తేల్చుకోవడానికి ఇప్పటికే రెండుసార్లు సర్వేలు చేయించినట్లు సమాచారం. ఎన్నికల నోటిఫికేషన వచ్చేలోగా ఫైనల్ సర్వే చేయించి అభ్యర్థులను ఖరారు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.పలువురు ఆశావహులు మంత్రిని కలిసి అవకాశం కల్పించాల్సిందిగా వినతులు సమర్పించుకుంటున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నుండి కొందరు మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు బీజేపీలో చేరేందుకు సిద్ధమై మంత్రి సంజయ్?ని కలుస్తున్నారు. అయితే ఆయన ఇతర పార్టీల నుంచి బీజేపీలోకి చేర్చుకునే విషయంలో ఆచీతూచి వ్యవహరిస్తున్నారు. మొదటి నుంచి పార్టీలో ఉన్నవారి మనోభావాలు దెబ్బతినకుండా చూడడంతోపాటు పార్టీలో ఉన్నవారు ప్రజల్లో మంచి పేరున్నవారు గెలిచే అవకాశాలుంటే ఆ ప్రాంతాల్లో ఇతర పార్టీల వారిని చేర్చుకోవద్దని భావిస్తున్నారు. పార్టీలో ఉన్నవారికి విజయావకాశాలు లేవు అనుకున్న చోట మాత్రమే ఇతరులను పార్టీలోకి తీసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఈ విషయాలను తేల్చుకోవడానికి ఆయన ఫైనల్ సర్వేపై ఆధారపడుతున్నారని, వివిధ వర్గాల ద్వారా కూడా సమాచారాన్ని సేకరిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



**పార్లమెంట్ నియోజకవర్గంలో వ్యూహాలు రచిస్తున్న 'బండి'**

**అన్ని మున్సిపాలిటీలను గెలుచుకోవడమే లక్ష్యం**



## కాంగ్రెస్,బీఆర్ఎస్, మజ్లిస్ లోపాయికారీ ఒప్పందం

### కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (ప్రజాజ్యోతి):** కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆరస్ పార్టీలు మజ్లిస్‌తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని మతం పేరుతో కుట్రలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాము మాత్రం అభివృద్ధి...

మిగతా 8లో...



## అక్రమ సంపాదనతో పదవులు కొనుగోలు చేసిన చరిత్ర నీది

-దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం

-వెలిశాల రాజేందర్ రావుపై

మాజీ మేయర్ తీవ్ర విమర్శలు

5 లో..

# ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి జాతీయ స్థాయికి కేపిఎస్ విద్యార్థిని అల్లే హేమ

**-సబ్-జూనియర్ ఖో-ఖో పోటీలకు ఎంపికౌ -కోరుట్లకు గర్వకారణం**

**కోరుట్ల,జనవరి 22 ప్రజాజ్యోతి:** కోరుట్ల పబ్లిక్ స్కూల్ మరోసారి తన ప్రతిభను జాతీయ స్థాయిలో చాటుకుంది. పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థిని అల్లే హేమ ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి సబ్-జూనియర్ ఖో-ఖో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విద్యా-క్రీడా వర్గాల్లో హర్షాతిరేకాలను వ్యక్తం చేస్తోంది.అల్లే హేమ జనవరి 23 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్?లో నిర్వహించనున్న జాతీయ స్థాయి శిక్షణ శిబిరానికి హాజరుకానున్నారు. అనంతరం జనవరి 29 నుంచి ఫిబ్రవరి 3 వరకు హర్యానాలో జరగనున్న సబ్-జూనియర్ ఖో-ఖో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.చిన్న వయసులోనే క్రీడలపై అపారమైన ఆసక్తి, క్రమశిక్షణతో కూడిన సాధనతో అల్లే హేమ ఈ స్థాయికి చేరుకోవడం అభినందనీయమని క్రీడా నిపుణులు ప్రశంసిస్తున్నారు. ఆమె సాధించిన ఈ ఘనత కోరుట్ల పబ్లిక్ స్కూల్?లో విద్యతో పాటు క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనం అని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మరియు కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్, పీటీ శంకర్, వనితతో పాటు ఉపాధ్యాయ బృందం అల్లే హేమను మరియు ఆమె తల్లిదండ్రులను సత్కరించారు. జాతీయ స్థాయిలో




ఆమె మరిన్ని విజయాలు సాధించాలని కోరారు.కేపీఎస్ పాఠశాల విద్యార్థులు విద్యా రంగంలోనే కాకుండా క్రీడా రంగంలోనూ విశేష విజయాలు సాధిస్తూ సంస్థకు మంచి పేరు తీసుకువస్తుండటం గర్వకారణమని వారు అన్నారు. అల్లే హేమ సాధించిన ఈ విజయం భవిష్యత్తులో మరెన్నో విద్యార్థులకు ప్రేరణగా నిలిచి, రాష్ట్రం-జాతీయ స్థాయిలో క్రీడల్లో రాణించేందుకు ఉత్సాహాన్ని కలిగిస్తుందని పాఠశాల యాజమాన్యం ఆశాభావం వ్యక్తం చేసింది.జాతీయ పోటీల్లో అల్లే హేమ మరిన్ని విజయాలు సాధించి, కోరుట్ల పేరు దేశవ్యాప్తంగా మార్మోగాలని స్థానికులు ఆకాంక్షిస్తున్నారు.

# కోరుట్ల పట్టణ 7 వ వార్డు నుంచి బరిలోకి ఉద్యమ నాయకుడు

**-వార్డ్ సంక్షేమమే తన ఏకైక లక్ష్యం-తిరుపతి నాయక్**



**కోరుట్ల,జనవరి 22 ప్రజాజ్యోతి:** మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కోరుట్ల పట్టణ రాజకీయ వాతావరణం రోజురోజుకూ మరింత వేడెక్కుతోంది. ఈ రాజకీయ హడావుడి మధ్య కోరుట్ల పట్టణంలోని 7 వ వార్డు నుంచి ప్రముఖ ఉద్యమ నాయకుడు, ప్రజా సమస్యల కోసం నిరంతరం పోరాడుతున్న గుగులోతు తిరుపతి నాయక్ తాను మున్సిపల్ ఎన్నికల బరిలోకి దిగుతున్నట్లు ప్రకటించడంతో వార్డు రాజకీయాలు ఆసక్తికర మలుపు తిరిగాయి.గూడు లేని పేదలకు గూడు కల్పించడమే తన జీవిత లక్ష్యమని చెబుతున్న తిరుపతి నాయక్, రాజకీయాలకంటే ఉద్యమాల ద్వారానే ప్రజలకు దగ్గరైన నాయకుడిగా గుర్తింపు పొందారు. గతంలో నిరాశ్రయులైన పేదల కోసం ఇళ్ల స్థలాలు ఇప్పించేందుకు గుడిసెలు వేసుకుని, అధికారుల దృష్టిని ఆకర్షించేలా ఉద్యమాలు నిర్వహించిన చరిత్ర ఆయనది. ఆ పోరాటాలే ఆయనను ప్రజల్లో ఒక నిబద్ధత కలిగిన ఉద్యమ నాయకుడిగా నిలబెట్టాయి.ప్రజా సమస్యలను పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా అనేకసార్లు పోరాటాలకు దిగిన తిరుపతి నాయక్, ప్రజల హక్కుల కోసం జైలు జీవితం కూడా అనుభవించారు. అయినా వెనక్కి తగ్గకుండా ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగడం ఆయన ప్రత్యేకత. నీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, రహదారుల దుస్థితి, పేదలకు నివాస సమస్యలు వంటి అంశాలపై నిరంతరం పోరాడుతూ ప్రజల నమ్మకాన్ని సంపాదించారు.ప్రజల మధ్యే నా రాజకీయాలు ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ,ప్రజల సమస్యలు నా సమస్యలుగా భావించి ఇప్పటివరకు పోరాడాను. ఎన్నికల్లో గెలిచినా గెలవకపోయినా నేను ప్రజల మధ్యే ఉంటాను. పదవులు నా లక్ష్యం కాదు. ఏడవ వార్డులోని ప్రతి సమస్యపై ముందుండి పోరాడతాను. పేదల గొంతుకగా ఎప్పటికీ నిలబడతాను అని స్పష్టం చేశారు.7 వ వార్డులో త్రాగునీటి సమస్య, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి, రహదారుల నిర్మాణం, పారిశుధ్య సమస్యలు, పేదలకు నివాసం, యువతకు ఉపాధి వంటి అంశాలపై తాను స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తానని తిరుపతి నాయక్ తెలిపారు. ముఖ్యంగా గూడు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించడం తన మొదటి ప్రాధాన్యత అని ఆయన పునరుద్ఘాటించారు.ఇప్పటికే ఏడవ వార్డులో తిరుపతి నాయక్?కు అనుచరులు, ఉద్యమకారులు, యువత పెద్ద సంఖ్యలో మద్దతుగా నిలుస్తున్నారు. ప్రజా ఉద్యమాల నుంచి ఎదిగిన నాయకుడిగా ఆయనకు ఉన్న ప్రజాదరణతో ఈ వార్డులో పోటీ మరింత ఆసక్తికరంగా మారిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.మొత్తానికి కోరుట్ల పట్టణ రాజకీయాల్లో ఉద్యమాల నుంచి ఎదిగిన నాయకుడిగా గుగులోతు తిరుపతి నాయక్ పేరు మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఏడవ వార్డు ఎన్నికల ఫలితం పట్టణ రాజకీయాలపై ప్రభావం చూపే అవకాశముందని స్థానికులు భావిస్తున్నారు. ప్రజల కోసం పోరాడే ఉద్యమ నాయకుడికి ప్రజలు ఎలాంటి తీర్పు ఇస్తారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.

# తిమ్మాపూర్‌లో ఎలక్ట్రిక్ బస్సు స్టాప్ ఏర్పాటు

**గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించిన డిపో మేనేజర్**

**ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల తిమ్మాపూర్ గ్రామంలో కరీంనగర్ డిపో ఎలక్ట్రిక్ బస్సులు ఆగకపోవడంతో గ్రామస్తులు డిపో మేనేజర్ శ్రీనివాస్?కు వినతి పత్రం అందజేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన డిపో మేనేజర్ తిమ్మాపూర్?లో ఎలక్ట్రిక్ బస్సు స్టాప్ ఏర్పాటు చేసి బస్సులు ఆగేలా చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా తిమ్మాపూర్, గుండారం తండా, బాకుర్పల్లె తండా ప్రజలు, సర్పంచులు సుభాష్, రాజు నాయక్, జయశ్రీ డిపో మేనేజర్ శ్రీనివాస్?కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే సమస్య పరిష్కారానికి అధికారులతో మాట్లాడిన తిమ్మాపూర్ మాజీ సింగిల్ విండో చైర్మన్ బొంత




గోపాల్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

# సమ్మక్క-సారక్క జాతర ఏర్పాట్లపై సమీక్ష

**శంకరపట్నం,జనవరి22 (ప్రజా జ్యోతి):** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలంలో తెలంగాణ కుంభమేళగా పేరుగాంచిన సమ్మక్క-సారక్క జాతర ఏర్పాట్లపై శంకరపట్నం తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. హుజురాబాద్ ఆర్డీవో రమేష్ బాబు హాజరై జాతర ఏర్పాట్లపై అధికారులతో ఆరా తీశారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాతరను విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో సురేఖ, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, ఎంపీఓ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



# బీజేపీ సీనియర్ నాయకులు మీసా శంకర్‌కు జిల్లా అధ్యక్షుడు గోపి నివాళులు

**వార్త (సంక్షిప్తం):**

**ముస్తాబాద్, జనవరి 22 (ప్రజా జ్యోతి):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు మీసా శంకర్ అనారోగ్యంతో గురువారం ఉదయం పరమపదించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి వారి స్వగృహానికి వెళ్లి పార్థివదేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# వేములవాడ కోర్టులో న్యాయవాదుల క్రీడలు ప్రారంభం

**వేములవాడ, జనవరి 22 (ప్రజాజ్యోతి):** వేములవాడ పట్టణంలోని బాలా నగర్ కోర్టులో న్యాయవాదుల కోసం చెస్, క్యారం క్రీడలను గురువారం సీనియర్ సివిల్ జడ్జి అజయ్ కుమార్ జాదవ్, జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్జి అజయ్ కుమార్ జాదవ్ మాట్లాడుతూ, రోజువారీ కేసుల ఒత్తిడిలో ఉన్న న్యాయవాదులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ఏజీపీలు బొడ్డు ప్రశాంత్ కుమార్, పుప్పాల భాను కృష్ణ, అడిషనల్ పీపీ అవధూత రజనీకాంత్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, ప్రధాన కార్యదర్శి గడ్డం సత్యనారాయణ రెడ్డి, ఉపాధ్యక్షులు కటకం జనార్ధన్, మహిళా ప్రతినిధి జక్కుల పద్మతో పాటు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



# ఆశీర్వదించండి.. ఆదరించండి

## మిట్టపల్లి ప్రవీణ్ కుమార్

**సుల్తానాబాద్, జనవరి 22: (ప్రజా జ్యోతి):**సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని నాలుగో వార్డులో కౌన్సిలర్ అభ్యర్థిగా బీజేపీ తరఫున పోటీ చేస్తున్న మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ ఎన్నికల ప్రచారాన్ని జోరుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన తన వార్డులో ఇంటింటా తిరుగుతూ ప్రజలను కలుసుకొని ఆశీర్వాదాలు కోరారు.వార్డ్ అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు సుల్తానాబాద్ పట్టణాన్ని మరింత సుందరంగా, అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. డ్రైనేజీ, తాగునీరు, రహదారులు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరించి, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.అలాగే బీజేపీ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేస్తామని, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, అందరికీ అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేస్తానని మిట్టపల్లి ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.ఈ ప్రచార కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మద్యం మత్తులో డ్రైవింగ్‌కు వినూత్న శిక్ష

## ట్రాఫిక్ విధుల్లో మందుబాబులు




**పెద్దపల్లి ప్రతినిధి (ప్రజాజ్యోతి), జనవరి 22:**
మద్యం మత్తులో వాహనం నడిపిన నలుగురు వ్యక్తులకు కోర్టు వినూత్న శిక్ష విధించింది. పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడిన కాచాపూర్ గ్రామానికి చెందిన తీగల అజయ్, చందపల్లికి చెందిన పర్శ తిరుపతి, చిన్నకల్వల గ్రామానికి చెందిన మెరుగు సతీష్, ఖిలవనపర్తి గ్రామానికి చెందిన తలారి రాహుల్‌లను గౌరవ న్యాయమూర్తి మంజుల గారి ఎదుట హాజరుపరిచారు.డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించడంతో పాటు, రెండు రోజులపాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని ఆదేశించింది.ఆదేశాల మేరకు శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని కమాన్, బస్టాండ్ కూడలిలో ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్ సమక్షంలో వారు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వహించారు.మద్యం సేవించి వాహనాలు నడపడం ప్రమాదకరమని, ఇటువంటి చర్యల వల్ల తమతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతుందని పోలీసులు హెచ్చరించారు. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

# శ్రీ గీతా మందిరంలో నాలుగో రోజు ఆధ్యాత్మిక కార్యక్రమాలు

**ఎల్లారెడ్డిపేట, జనవరి 22 (ప్రజా జ్యోతి):** ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల గొల్లపల్లిలో ఉన్న శ్రీ గీతా మందిరంలో నాలుగో రోజు కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, పాతకాల పూజలు శ్రీ రాధాకృష్ణులకు నిర్వహించగా, శంకరాచార్యులకు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా నిషా దినోత్సవం, చండీ హోమాలు, శ్రీ రాధాకృష్ణ స్వామి వారి ఎదుర్కోల్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం పూజ, తీర్థ ప్రసాదాలను వేదమంత్రాల మధ్య శ్రీ రాచర్ల రఘురామ శర్మ భక్తులకు అందజేశారు.



# బిఆర్ఎస్ నాయకుల కొవ్వొత్తుల ర్యాలీ హాస్యాస్పదం

## డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి

**చొప్పదండి, జనవరి 22 (ప్రజా జ్యోతి):**
చొప్పదండి పట్టణంలోని సెంట్రల్ లైటింగ్ పనుల్లో జాప్యం పై బిఆర్ఎస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ చేయడం హాస్యాస్పదమని జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి ఎద్దేవా చేశారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ర్యాలీ సందర్భంగా అన్ని అబద్ధాలే మాట్లాడారని విమర్శించారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి కార్యక్రమాలకు 141 కోట్లు నిధులు తెచ్చామని, అందులో భాగంగా చొప్పదండి పట్టణానికి సెంట్రల్ లైటింగ్ తదితర పనుల కోసం 38 కోట్లు వెచ్చించామని చెప్పడం పట్ల అభ్యంతర వ్యక్తం చేశారు. జీవో విడుదల చేసింది వాస్తవమైనప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. కొండగట్టుకు 100 కోట్లు కేటాయించమని చెప్పి తట్టెడు మట్టి తీసిన పాపా న పోలేదని అన్నారు. అప్పుడు ఎలక్షన్లు సమీపిస్తుండడంతో హడావిడిగా సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా పిట్టగోడలు కట్టారని ఘాటుగా విమర్శించారు. వాటికి కూడా నిధులు మంజూరు చేయలేదని, తగిన నిధులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యమే చొరవ తీసుకొని విడుదల చేయించారన్నారు.ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ను విమర్శించే స్థాయి రవిశంకర్ కు లేదన్నారు. చొప్పదండి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురుతుంది అని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికైనా మాజీ ఎమ్మెల్యే తప్పుడు ప్రకటనలు మానుకోవాలని సూచించారు. మార్కెట్ చైర్మన్ కొత్తూరు మహేష్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్యే తనకు అనుకూలమైన కాంట్రాక్టర్ కు సెంట్రల్ లైటింగ్ పనులు



అప్పజెప్పి కూడా సకాలంలో పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. తన అసమర్థతను కప్పిపుచ్చుకొని కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చొప్పదండి నియోజకవర్గం ను ఎడ్యుకేషన్ హబ్ గా మార్చడంతో పాటు రాష్ట్రంలోనే ఆదర్శంగా ఉంచాలని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నిజానపురం చందు, ఆత్మ చైర్మన్ గుర్రం రాజేందర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, సర్పంచులు గన్ను శ్రీనివాసరెడ్డి, పురం మాధవి రాజేశం, నాయకులు కొట్టె అశోక్, ముద్దసాని రంగన్న, మునిగాల చందు, గుంటి స్వరూప శ్యామ్, కడారి శంకర్ ,వెంకటేష్ ,ప్రసాద్, రాములు, గుర్రం రమేష్ గౌడ్, కనకయ్య పాల్గొన్నారు.

# క్యాథ్ ల్యాబ్ సెంటర్ ఏర్పాటు పనులను పరిశీలించిన రామగుండం ఎమ్మెల్యే

**గోదావరిఖని , జనవరి 22(ప్రజా జ్యోతి):**
గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పటల్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యాథ్ ల్యాబ్ సెంటర్ పనులను రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పరిశీలించారు.గురువారం ఆయన ఆర్జీవన్ జీఎం లలిత్ కుమార్ తో కలిసి సందర్శించారు.ఏర్పాటు పనుల పురోగతి పై అధికారులను అడిగి తెలుసుకున్నారు.నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామగుండం నియోజవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు.దీనిలో భాగంగా క్యాథ్ ల్యాబ్ ను ఏర్పాటు చేస్తున్నామని,త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.క్యాథ్ ల్యాబ్ ప్రారంభమైతే రామగుండంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు గుండె సంబంధిత చికిత్సల కోసం కరీంనగర్,హైదరాబాద్?కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇక్కడే మెరుగైన వైద్యం పొందవచ్చని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్




రాకపోకలకు సౌలభ్యంగా ఉండేలా హాస్పటల్?కు రెండు ప్రవేశ మార్గాలు ఉండాలని సూచించారు.మెరుగైన వైద్య సేవల కోసమే మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# నేడే వసంత పంచమి

## సర్వాంగ సుందరంగా ముస్తాబైన శ్రీ మహాశక్తి దేవాలయం

**కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (ప్రజాజ్యోతి):**
కరీంనగర్?లోని మహిమాన్విత దివ్యక్షేత్రం శ్రీ మహాశక్తి దేవాలయం శుక్రవారం జరగనున్న వసంత పంచమి మహోత్సవ వేడుకలకు ఘనంగా ముస్తాబైంది. శ్రీశ్రీశ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ విద్యారణ్య భారతి స్వామివారి దివ్య ఆశీస్సులతో వసంత పంచమి పూజా మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేశారు.దేవాలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, రంగురంగుల పుష్పాల అలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వసంత పంచమి సందర్భంగా ఉదయం 4 గంటలకు శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి, శ్రీ మహాదుర్గ, శ్రీ మహాలక్ష్మీ, శ్రీ మహాసరస్వతి అమ్మవార్లకు అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం 7.30 గంటలకు శ్రీ మహాసరస్వతి దేవికి (ఉత్సవ మూర్తికి) ప్రత్యేక పూజలు,



అభిషేకం, కుంకుమార్చనతో పాటు విద్యార్థులచే సామూహిక పుస్తక పూజలు జరగనున్నాయి.జ్ఞానాన్ని ప్రసాదించే వేదమాత, అక్షరానికి ఆదిదేవత అయిన శ్రీ మహాశక్తి శ్రీ మహా సరస్వతి అమ్మవారు చిన్నారుల అక్షరాభ్యాసానికి కొంగు బంగారంగా భక్తుల విశ్వాసాన్ని పొందారు. వసంత పంచమి రోజున అమ్మవారిని దర్శించి పూజించిన వారికి జ్ఞానం, వివేకం, వాక్చాతుర్యం, సృజనాత్మక శక్తి, మేధో సామర్థ్యం పెరుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.ప్రతి ఏటా వసంత పంచమి సందర్భంగా వేలాదిగా భక్తులు తరలివచ్చి, చిన్నారుల అక్షరాభ్యాస కార్యక్రమాల్లో పాల్గొంటుండటంతో శ్రీ మహాశక్తి ఆలయం మరో బాసర క్షేత్రంలా విరాజిల్లుతోంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి అమ్మవారి కృపకు పాత్రులవుతున్నారు.శుక్రవారం జరిగే వసంత పంచమి మహోత్సవ పూజా కార్యక్రమాల్లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ దంపతులు పాల్గొననున్నారని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ పవిత్ర వసంత పంచమి పూజా కార్యక్రమాల్లో సమస్త హిందూ బంధువులు పాల్గొని శ్రీ మహాశక్తి అమ్మవారి ఆశీస్సులు పొందాలని వారు కోరారు.

# తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ నియామకం

## రాష్ట్ర అధ్యక్షుడిగా అతికం రాజశేఖర్ గౌడ్



**కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం నూతన రాష్ట్ర కమిటీని రాష్ట్ర వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు అందే బీరన్న హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా వార్డు సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా నూతన కమిటీ పనిచేయాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో వార్డు సభ్యులు అందిస్తున్న సేవలను ఆయన గుర్తు చేశారు.నూతన రాష్ట్ర కమిటీలో రాష్ట్ర అధ్యక్షులుగా న్యాయవాది అతికం రాజశేఖర్ గౌడ్‌ను, ప్రధాన కార్యదర్శిగా మెస్రం భాస్కర్‌ను (ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా) నియమించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పులింటి మమత పెద్దులు (ఉమ్మడి నిజామాబాద్ జిల్లా), అధికార ప్రతినిధిగా పరంగి శైలజ (ఉమ్మడి నల్లగొండ జిల్లా), రాష్ట్ర సహాయ కార్యదర్శులుగా ఈర్ల శ్యామల, ప్రవీణ్ (పెద్దపల్లి జిల్లా), రాష్ట్ర కోశాధికారిగా బత్తిని అనిల్ గౌడ్ (రాజన్న సిరిసిల్ల జిల్లా)ను ఎంపిక చేశారు.కార్యవర్గ సభ్యులుగా జి.యాకయ్య (ఉమ్మడి వరంగల్), ఆర్. వెంకన్న (ఉమ్మడి మెదక్), డి. శ్రీకాంత్ (కరీంనగర్ జిల్లా)ను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అందే బీరన్న, న్యాయవాది కనకం వంశీ కిరణ్?లను, న్యాయ సలహాదారులుగా కట్ట రమేష్, ఆడెపు దినేష్‌లను, గౌరవ సలహాదారులుగా జవారె రాహుల్, కొలుగూరి సూర్యకిరణ్, ఈర్ల రామచందర్?లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆర్నకొండ జడ్పీహెచ్ఎస్‌లో సీఎం కప్- 2 ఆటల పోటీలు



**చొప్పదండి, జనవరి 22 (ప్రజా జ్యోతి):** చొప్పదండి మండలం ఆర్నకొండ జడ్పీహెచ్ఎస్ లో మూడు గ్రామాలు ఆర్నకొండ, చిట్యాలపల్లి, మంగళపల్లి ల క్లస్టర్ స్థాయి సీఎం కప్-2 ఆటల పోటీలు కోకో ,కబడ్డీ వాలీబాల్ నిర్వహించారు. ఇందులో సుమారుగా 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సన్నాహక సమావేశానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీక్షితుల శ్రీనివాస్ అధ్యక్షునిగా, ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ వడ్లూరి లక్ష్మి భూమయ్య పాల్గొని క్రీడాకారులను, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలు శారీరక ,మానసిక ఆనందాన్ని ఇస్తాయని, భావోద్వేగాలను అదుపులో ఉంచుకొని స్నేహపూర్వకంగా గెలుపు ఓటములను స్వీకరించాలని, క్రమశిక్షణ అలవాటు అవుతుందని అన్నారు. పాఠశాలల్లో జరిగే క్రీడలకు గాని, క్రీడాకారులు ఎవరికైనా గాని తమ వంతు సహకారం అందిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు.ఉప సర్పంచ్ జక్కుల అనిల్, వార్డు మెంబర్ మల్లేశం, ఆర్నకొండ గ్రామ పంచాయితీ కార్యదర్శి సాయి కృష్ణ గౌడ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.చంద్ర శేఖర్, ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన.. పలు సూచనలు చేసిన సుడా చైర్మన్




**కరీంనగర్ టౌన్,జనవరి 22 (ప్రజాజ్యోతి):** కరీంనగర్ మార్కెట్ రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, పారిశుద్ధ్య లోపం లేకుండా దేవాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని దేవాదాయ, మున్సిపల్ శానిటేషన్ అధికారులను ఆయన ఆదేశించారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ, బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం క్యూ లైన్ల కోసం బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి దేవాలయం వరకు నూతన ఫుట్‌పాత్ నిర్మాణం చేపట్టామని, అన్ని పనులు శుక్రవారం ఉదయానికి పూర్తవుతాయని చెప్పారు. బ్రహ్మోత్సవాలను ఘనంగా, అద్భుతంగా నిర్వహిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, చకిలం గంగాధర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# సర్పంచుల ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడిగా గడ్డం జీవన్ రెడ్డి



**కొడిమ్యాల,జనవరి 22,(ప్రజాజ్యోతి):** జగిత్యాల జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షుడిగా కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన సర్పంచ్ గడ్డం జీవన్ రెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు బొల్లిశెట్టి గంగారెడ్డి అధికారికంగా ప్రకటించారు.ఈ సందర్భంగా గడ్డం జీవన్ రెడ్డి మాట్లాడుతూ ఈఅవకాశాన్ని కల్పించిన ఫోరం అధ్యక్షుడు,తన నియామకానికి సహకరించిన చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు.సర్పంచుల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం కట్టుబడి పనిచేస్తానని తెలిపారు.

# చిప్పకుర్తి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం




**రామడుగు,జనవరి23(ప్రజా జ్యోతి):** రామడుగు మండలం చిప్పకుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం ఆయుష్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఈ శిబిరంలో 150 మందికి ఉచిత షుగర్,బీపీ పరీక్షలు చేసి మందులు ఉచింతగా అందచేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గాదె మధుకర్ రెడ్డి,ఉప సర్పంచ్ సందపలకల మహేందర్,కార్యదర్శి బోనాల రాజ్ కుమార్,హాస్పిటల్ వైద్యులు డా.సమీర్ ఎండీ, హాస్పిటల్ మేనేజ్మెంట్ డైరెక్టర్ ఎడవెల్లి అనిల్, కుమార్,శ్రీనివాస్,ప్రసాద్ మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నవోదయ లో రోబోటిక్ ఎక్స్ పో ప్రదర్శన



**చొప్పదండి, జనవరి 22 (ప్రజా జ్యోతి):** చొప్పదండి జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం రోబోటిక్ ఎక్స్ పో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ మోహన్ హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థుల నైపుణ్యాలు వెలికి తీయడంలో నవోదయ విద్యాలయాలు ముందు వరుసలో ఉంటున్నాయని అన్నారు. చిన్న వయసులో విద్యార్థుల సృజనాత్మకతను పెంపొందిస్తున్న ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ బ్రహ్మానంద రెడ్డి, చొప్పదండి జడ్పీహెచస్ ( బాయ్స్) హెచ్ఎం రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట

## - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు



**కథలాపూర్, జనవరి 22(ప్రజాజ్యోతి):** మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని కథలాపూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కాయితీ నాగరాజు అన్నారు. కథలాపూర్ మండలంలోని పలు గ్రామాల మహిళా సంఘాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వం రూ.కోటి 10 లక్షల నిధులు మంజూరు చేయడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం మండల కేంద్రంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ .. మహిళల స్వావలంబన, ఆర్థిక ప్రగతి దిశగా నిధుల మంజూరు కీలకమని కొనియాడారు. మహిళా సంఘాల భవనాలు నిర్మించటం వల్ల స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు సామాజికంగా బలపడేందుకు మహిళా సంఘాల భవనాలు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ మహిళల అభివృద్ధి పట్ల కట్టుబడి ఉందని, భవిష్యత్తులో కూడా మహిళా సంక్షేమానికి సంబంధించిన పథకాలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని నాయకులు స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ యూత్ ఉపాధ్యక్షులు కాశావత్రి వంశీ, ఎండి రేహాన్, కాంగ్రెస్ నాయకులు లింగారావు, నీలకంఠం, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాల ఆకస్మిక తనిఖీ



**కొడిమ్యాల,జనవరి 22,(ప్రజాజ్యోతి):**
మండలం సంద్రాలపల్లి గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడిన కమిషన్ సభ్యులు బాలల హక్కులు,పోక్సో చట్టం,బాలల రక్షణకు సంబంధించిన హెల్ప్?లైన్ నెంబర్లపై అవగాహన కల్పించారు.అలాగే విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందిస్తూ వారి భవిష్యత్ లక్ష్యాల సాధనకు ప్రోత్సహించారు.ఈ తనిఖీలో కమిషన్ ఛైర్?పర్సన్ సీతా దయాకర్ రెడ్డి,సభ్యులు వచన్ కుమార్,చందన,అపర్ణ,సరితపాఠశాలపరిసరాలు,వంటగది,మరుగుదొడ్లు, స్టోర్?రూం తదితర వాటిని పరిశీలించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము,సెక్టోరల్ ఆఫీసర్ మహేష్,మండల విద్యాధికారి శ్రీనివాస్,జిల్లా ఎస్సి వెల్ఫేర్ ఆఫీసర్ రాజ్ కుమార్,జిల్లా చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ హరీష్,సురేష్,పాఠశాల స్పెషల్ ఆఫీసర్ లావణ్య,ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఎస్ఐని కలిసిన మండల నాయకులు



**కథలాపూర్, జనవరి 22(ప్రజాజ్యోతి):**
మండలంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ రవికిరణ్‌కు కథలాపూర్ మండల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్టేషన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ పాత్ర కీలకమని పేర్కొంటూ, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవలు అందించాలని నాయకులు ఆకాంక్షించారు. నూతన ఎస్ఐ స్పందిస్తూ ప్రజలు, ప్రజాప్రతినిధుల సహకారంతో చట్టసవ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని, అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల రైతు నాయకులు, కళాధర గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మెన్ గడ్డం భూమారెడ్డి, మాజీ ఎంపీటీసీ మామిడిపెల్లి రవి, ముష్కరి కిరణ్ తదితరులు ఉన్నారు.

## బీఆరస్ నుంచి జనసేనకు మొగలిపాలెం రమేష్

**కొడిమ్యాల,జనవరి 22,(ప్రజాజ్యోతి):**మండల కేంద్రానికి చెందిన



మొగలిపాలెం రమేష్ జనసేనలో చేరారు.హైదరాబాద్ లో ఇరు రాష్ట్రాల కార్యదర్శి తాళ్లూరి రామ్ సమక్షంలో చేరిన ఆయనగతంలో తెలంగాణ ఉద్యమ నాయకుడిగా,చొప్పదండి బీఆరస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ గా పనిచేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్ గౌడ్,రాష్ట్ర నాయకులు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు సౌండ్ బాక్స్ వితరణ

**కథలాపూర్, జనవరి 22 (ప్రజాజ్యోతి):**
కథలాపూర్ మండలం తకళ్ళపెల్లిలో ప్రభుత్వ పాఠశాలకు 2010- 11 బ్యాచ్ కు చెందిన విద్యార్థులు విద్యాభివృద్ధి దిశగా సౌండ్ బాక్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని సౌండ్ బాక్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయునికి అందించారు. సౌండ్ బాక్స్ ద్వారా ఉదయ ప్రార్థనలు, జాతీయ గీతం, విద్యాసంబంధిత ప్రకటనలు, అవగాహన కార్యక్రమాలు సులభంగా నిర్వహించుకోవచ్చని వారు తెలిపారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆసక్తి పెరగడంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందనిపేర్కొన్నారు.పాఠశాలప్రధానోపాధ్యాయుల



ు ఆకుల లక్ష్మి నారాయణ, ఇర్ఫాన్, శంకర్, హరీష్, ఫిరోజ్, గంగాధర్, ప్రసాద్, ప్రవీణ్, సాజీద్ తదితరులు పాల్గొన్నారు.

# మారేడుపల్లిలో రోడ్డు మరమ్మతు పనులు మొదలు

**ఎండపల్లి, జనవరి 22, (ప్రజా జ్యోతి) :**
మండలంలోని మారేడుపల్లి గ్రామంలోని వంతెన వద్ద గుంతలుగా ఉన్న రోడ్డుతో ప్రజలు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా, గ్రామపంచాయతీ పాలకవర్గం దృష్టి సారించి గురువారం రోజున బ్లేడ్ ట్రాక్టర్ సహాయంతో గ్రామ సర్పంచ్ బాలసాని శారద మల్లేశం,ఉప సర్పంచ్, చీమల శ్రీనివాస్,వార్డు సభ్యుల సమక్షంలో వంతెన వద్ద గుంతలుగా ఉన్న రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టి రోడ్డు ను చదును చేసి సమానంగా చేయడం జరిగింది ,కాగా ప్రజల ఇబ్బందుల్ని దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు వంతెన వద్ద గుంతలు పూడ్చి,అలాగే రోడ్డు మరమ్మతు పనులు



చేపట్టినందుకుగాను, ప్రజలు,వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు,

# అక్రమ సంపాదనతో పదవులు కొనుగోలు చేసిన చరిత్ర నీది

**-దమ్ముంటే ప్రజాక్షేత్రంలో తేల్చుకుందాం**

**-వెలిశాల రాజేందర్ రావుపై మాజీ మేయర్ తీవ్ర విమర్శలు**

**కరీంనగర్ బ్యూరో, జనవరి 22( ప్రజాజ్యోతి):**
కరీంనగర్ నగరంలోకి వెలిశాల రాజేందర్ రావు "ఎలుగుబంటి లా చొరబడ్డారు" అంటూ బీజేపీ నాయకులు, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్రంగా మండిపడ్డారు. భగత్?నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలోని సీనియర్ నాయకులను పక్కనపెట్టి, పదేళ్లు ప్రతిపక్షంలో పనిచేసిన నాయకులను అణగదొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు.అక్రమ కాంట్రాక్టులు, దొంగ బిల్లులతో సంపాదించిన డబ్బుతో పదవులు కొనుగోలు చేసి రాజకీయాలు చేస్తున్నారని రాజేందర్ రావుపై తీవ్ర ఆరోపణలు చేశారు. పలుమార్లు ఎన్నికల్లో ఓడినా తీరుమారలేదని, ప్రజలను మభ్యపెట్టేచిల్లర రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.తాము గత 35 ఏళ్లుగా ప్రజల మధ్య ఉండి పనిచేస్తూ, ఐదుసార్లు ప్రజల చేత ఎన్నుకోబడిన నాయకులమని తెలిపారు. కరీంనగర్ అభివృద్ధిలో తమ పాత్ర స్పష్టంగా కనిపిస్తుందని, ప్రజల



మద్దతుతోనే రాజకీయాల్లో కొనసాగుతున్నామని స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరిస్తూ, దమ్ముంటే ప్రజా క్షేత్రంలో ఎదుర్కోవాలని సవాల్ విసిరారు.ఈ సమావేశంలో బీజేపీ మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**'సాక్షి' ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ-జవ్వాజి ప్రసాద్ గౌడ్**

**కొనరావుపేట: జనవరి.22(ప్రజా జ్యోతి):**
పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని న్యాయవాది ప్రసాద్ గౌడ్ అన్నారు. కోనరావుపేట మండలం ధర్మారం ప్రభుత్వ పాఠశాలలోని 47 మంది విద్యార్థులకు సాక్షి దినపత్రిక ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజు సాక్షి దినపత్రికలో వచ్చే స్టడీ మెటీరియల్ పదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని



చెప్పారు. దాన్ని సద్వినియోగం చేసుకొని వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మురళీ నాయక్,ప్యాక్స్ మాజీ డైరెక్టర్ జవ్వాజి దేవయ్య గౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## త్రి టౌన్ సిఐని మర్యాదపూర్వకంగా కలిసిన బితసి సంఘం నాయకులు



**కరీంనగర్ టౌన్, జనవరి 22( ప్రజాజ్యోతి):** కరీంనగర్ మూడవ పట్టణ పోలీస్ స్టేషన్ సిఐగా బాధ్యతలు స్వీకరించిన సిఐ తిరుమల్ గౌడ్ ను బి సి సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలుతెలిపారు. సి ఐ ని కలిసిన వారి లో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షులు నర్సింగోజు శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నల్లగొని శ్రీనివాస్,బీసీ సంఘం నాయకులు తదితరులుఉన్నారు.

# 100శాతం పన్నులు వసూలు చేయాలి

**రామగుండం కార్పొరేషన్ కమిషనర్ అరుణశ్రీ**



**గోదావరిఖని , జనవరి 22(ప్రజా జ్యోతి):** ఆర్థిక సంవత్సరం ముగింపు సమీపిస్తున్నందున ఆస్తి పన్ను వసూళ్లలో వేగం పెంచి నూరు శాతం లక్ష్యాన్ని సాధించాలని రామగుండం కార్పొరేషన్ కమిషనర్ జె.అరుణ శ్రీ ఆదేశించాడు.వార్డు అధికారులు,సహాయకులు ,సిబ్బందితో గురువారం రామగుండం కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సంధర్భంగా అరుణశ్రీ మాట్లాడుతూ భారీ బకాయలు ఉన్న వ్యక్తులు,సంస్థలపై మొదటగా దృష్టి సారించాలన్నారు.నీటి సరఫరా ఛార్జీలు,ట్రేడ్ లైసెన్స్ రుసుం కూడా లక్ష్యం ప్రకారం వసూలు చేయాలన్నారు.ఇందిరమ్మ ఇళ్ల డేటా క్షేత్ర స్థాయిలో సేకరించి ఆన్ లైన్ లో నమోదు చేయాలని సూచించారు.ఇటీవల కొంత మంది పేదలకు స్థలాల పట్టాలు ఇచ్చిన నేపధ్యంలో వారు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకోవడానికి వీలుగా ఎల్ టూ కేటగిరీ నుండి ఎల్ వన్ కు మార్చాలని,పారిశుద్ధ్య నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని,ప్రతి స్వచ్ఛ వాహనం డి ఆర్ సి కేంద్రానికి వెళ్ళాలని,రానున్న ఎన్నికల నేపధ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మరుగు దొడ్లు,నీటి సరఫరా,లైటింగ్ ,ర్యాంప్ తదితర అవసరమైన వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో కార్పొరేషన్ ఎస్ ఇ గురువీర,ఇ ఇ పి వి.రామన్,సెక్రెటరీ ఉమా మహేశ్వర్ రా,అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు,ఎ సి పి శ్రీహరి,డి.ఇ లు షాభాజ్,శాంతి స్వరూప్,జగదీష్,సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

# శాతవాహనలో 24న మెగా ఉద్యోగ మేళా




**కరీంనగర్ టౌన్, జనవరి 22( ప్రజాజ్యోతి):** శాతవాహన విశ్వవిద్యాలయంలో ఈనెల 24న మెగా ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి ఆచార్య యు. ఉమేశ్ కుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ తెలిపారు. శాతవాహన వర్సిటీ-నిపుణ హ్యూమన్ డెవలప్మెంట్ సొసైటీ కలిసి జనవరి 24న ఉదయం 9 గంటలకు విశ్వవిద్యాలయంలో ఉద్యోగ మేళా ప్రారంభం కానుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరు మురళి ఆరంభించనున్నారు. ఈ మెగా జాబ్ మేళా లో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ,ఫార్మసీ, నర్సింగ్, హాస్పిటాలిటీ, బ్యాంకింగ్, రిటైల్, ఎఫ?ంసీజీ, మేనేజ్మెంట్ వంటి 60కిపైగా కార్పొరేట్ కంపెనీల్లో 5000 వేలకు పైగా ఉద్యోగాల్లో నియామకాలు ఉంటాయని జీతం సంవత్సరానికి కనీసం రూ. 1,20,000/- నుండి గరిష్టంగా రూ. 4,50,000 వరకు లభిస్తుందని పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటీఐ, బీఈ/బీ.టెక్, ఎంఈ/ఎం.టెక్, బీఎస్సీ, బీ.కామ్, బీబీఏ, ఎంఎస్సీ, ఎం.కామ్, ఎంబీఏ, ఎంసీఏ, బి. ఫార్మసీ, ఎం. ఫార్మసీ అర్హత కలిగిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొనవచ్చని జాబ్ మేళాలో పాల్గొన్న అభ్యర్థులలో కనీసం 25% నుండి 30% మందికి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఈ మనోహర్, ఓఎస్డీటీ టూ వీసీ డాక్టర్ డి హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమాకాంత్,ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె పద్మావతి, వివిధ విభాగాల అధిపతులు అధ్యాపకులు పాల్గొన్నారు.

# పాలన చేతగాక - రాజకీయ కక్ష సాధింపు

**-కేటీఆర్ కు సిట్ నోటీసులు ఇవ్వడం అనుచితం-చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



**చొప్పదండి, జనవరి 22 ( ప్రజా జ్యోతి):** కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేతగాక రాజకీయ కక్ష సాధిస్తున్నదని, ఇటీవల హరీష్ రావుకు, ప్రస్తుతం కేటీఆర్ కు నోటీసులు ఇవ్వడం ద్వారా డైవర్ట్ పాలిటిక్స్ చేస్తున్నదని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు.ముఖ్యమంత్రి దావోస్ పర్యటన లు చేస్తూ రాష్ట్రంలో మాత్రం సిట్ విచారణలు,అక్రమఅరెస్టుల పర్వం కొనసాగిస్తున్నారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు, ఫార్ములా ఈ-రేస్ తదితర ఆధారాలు లేని కేసులకు నోటీసులు ఇచ్చారని,మున్సిపాలిటీ ఎన్నికలను కాంగ్రెస్ సర్కార్ డైవర్ట్ చేస్తున్నదని ఆరోపించారు.పాలన గాలికి వదిలి సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి చేస్తున్న కక్ష సాధింపు చర్యలని అన్నారు.రాష్ట్రంలో యూరియా దొరకక రైతులు ఆందోళన చెందుతున్నారని, ముఖ్యమంత్రి మాత్రం సర్కారుసొమ్ముతోజల్సాలు చేస్తున్నారన్నారు.సంక్రాంతి పండుగ తర్వాత రైతుభరోసా ఊసే లేదని,ఫోన్ ట్యాపింగ్ కేసులో పసలేదని అత్యున్నత న్యాయస్థానాలు తేల్చి చెప్పినా, కాంగ్రెస్ ప్రభుత్వం నీచపు రాజకీయాలు చేస్తున్నదన్నారు.రేవంత్ సర్కారు ఆడించినట్లు పోలీస్ యంత్రాంగం ఆడుతుండం విచారకరమన్నారు.ఎన్ని కేసులు పెట్టినా,ఎన్ని నోటీసులుఇచ్చినా న్యాయపరంగా ఎదుర్కొంటామని చెప్పారు.

## మండల స్థాయి సీఎం కప్ లో పాల్గొనే యువకులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలి



**ముత్తారం జనవరి, 22(ప్రజా జ్యోతి):** మండల కేంద్రంలో నిర్వహించే సీఎం కప్ 2025 మండల స్థాయి క్రీడా పోటీలను ఈనెల 28 నుండి 31 వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామస్థాయి నుండి పాల్గొనాలనుకునే యువకులు ఆన్లైన్లో పేరు నమోదు చేసుకొని పోటీలో పాల్గొనాలని ఎంపీడీవో సురేష్ తెలిపారు.

## నామపూర్ క్లస్టర్ స్థాయిలో సీఎం కప్ క్రీడా పోటీలు విజయవంతం



**ముస్తాబాద్, జనవరి 22 (ప్రజా జ్యోతి):** నామపూర్ క్లస్టర్ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. నామపూర్, గూడూర్, గోపాల్పల్లి గ్రామాలకు చెందిన క్రీడాకారులతో గురువారం నామపూర్ జెడ్పిహెచ్ఎస్ మైదానంలో ఈ పోటీలు ఉత్సాహభరితంగా నిర్వహించారు.గ్రామ సర్పంచ్ మాదాసు అనిల్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. గ్రామీణ యువతకు క్రీడలు శారీరక, మానసిక బలాన్ని పెంచడంతో పాటు క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని ఆయన అన్నారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ విభాగాల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు.విజేతలకు నిర్వాహకులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సీఎం కప్ క్లస్టర్ స్థాయి కమిటీ- నామపూర్ సమర్థవంతంగా నిర్వహించగా, ప్రధానోపాధ్యాయులు సుధాకర్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కుంట శ్రీనివాస్, గ్రామ పెద్దలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం ముఖ్యాంశాల పుస్తకం ఆవిష్కరణ

**వేములవాడ, జనవరి 22 (ప్రజా జ్యోతి):** బహుజనసేన రాజన్న సిరిసిల్ల ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గడప గడపకు రాజ్యాంగం చేరాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా నూతనంగా ముద్రించిన భారత రాజ్యాంగం ముఖ్యాంశాల పుస్తకాన్ని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం అభినందనీయమని, ప్రతి పౌరుడు రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, కర్తవ్యాలను తెలుసుకొని దేశాభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. బహుజనసేన ఆర్గనైజేషన్ అధ్యక్షులు జింక శ్రీధర్ మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి పౌరుడికి ఒక ఆయుధమని, ముఖ్యంగా బహుజనులు, అణగారిన వర్గాలు రాజ్యాంగాన్ని చదివి తమ హక్కులను తెలుసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడిసె మనోజ్ కుమార్, జింక శ్రీకాంత్, బొడ్డు మహేందర్, సుంకరి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# వేములవాడలో హత్య కేసు ఛేదన

## నలుగురు నిందితుల అరెస్ట్




**వేములవాడ, జనవరి 22 (ప్రజాజ్యోతి):**
వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన హత్య కేసును ఏఎస్పీ పర్యవేక్షణలో, పట్టణ సీఐ నేతృత్వంలో పోలీసులు వేగంగా ఛేదించి నలుగురు నిందితులను అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, ఈ నెల 13 కోలకాని సతీష్ అనే వ్యక్తి తీవ్ర గాయాలతో వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, అక్రమ సంబంధం అనుమానాల నేపథ్యంలో నిందితులు పూర్వ ప్రణాళికతో కలిసి సతీష్?పై దాడి చేసి హత్య చేసినట్లు విచారణలో తేలింది.ఈ కేసులో నిందితులు ఉమ్మరెడ్డి విష్ణు (41), తిప్పాయపల్లి, ఉమ్మరెడ్డి కృష్ణ ఏ రాజు, పెంట సుదర్శన్ ఏ సురేష్, మ్యాకల వేణు. వీరంతా కలిసి మద్యం సేవించిన అనంతరం సతీష్?ను కర్రలు, ప్లాస్టిక్ పైపు తో తీవ్రంగా కొట్టి గాయపరిచి, ప్రమాదం జరిగినట్టు నటిస్తూ ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. చికిత్స పొందుతూ సతీష్ మృతి చెందాడు. ఘటన అనంతరం నిందితులు పరారయ్యారు.సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా విశ్లేషణతో పాటు ప్రత్యేక దర్యాప్తు ద్వారా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు,గురువారం వేములవాడలోని సాయి రక్షా దాబా సమీపంలో వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్?కు పంపినట్లు తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.

# ప్రముఖులకు ఆహ్వాన పత్రికల అందజేత



**ముస్తాబాద్, జనవరి 22 (ప్రజా జ్యోతి):**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఏఐడీడబ్ల్యుఏ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కార్యక్రమానికి సంబంధించి ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. జిల్లా కార్యదర్శి జవ్వాజి విమలక్క, ఉపాధ్యక్షురాలు అడెపు రజిత, ముస్తాబాద్ మండల కార్యదర్శి గడప మాధవి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ సందర్భంగా కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షులు మెంగాని మనోహర్, మానవ హక్కుల కమిషన్ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ జహంగీర్, కేటీఆర్ సేన ముస్తాబాద్ మండల అధ్యక్షులు వంగూరి దిలీప్, జిల్లా ఇంచార్జ్ సురోజుల నరేంద్రచారికి ఆహ్వాన పత్రికలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# జాతీయ ఓటర్ల దినోత్సవం రోజున ప్రతిజ్ఞ

**చొప్పదండి ,జనవరి 22 (ప్రజా జ్యోతి):**
జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా పోలింగ్ కేంద్రాల ప్రదేశాల్లో ఈనెల 25న ప్రతిజ్ఞ, తదితర కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వులు జారీ చేసినట్లు తాహసిల్దార్ పి.నవీన్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి పోలింగ్ స్టేషన్ ప్రాంతంలో ఎన్ వి డి కార్యక్రమాన్ని నిర్వహించి కొత్తగా నమోదైన ఓటర్లను సన్మానించాలని సూచించారు. కార్యక్రమాల వివరాలను వాట్సప్ తదితర గ్రూప్ ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని, పోలింగ్ కేంద్రాలలో కనీస సౌకర్యాలు, ఈవీఎం, ఓటర్ హెల్ప్ లైన్ యాప్ తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు.

# రోడ్డు భద్రత పై అవగాహన కార్యక్రమం

## ఎస్పీ కే ప్రశాంత్ రెడ్డి

**కోనరావుపేట,జనవరి.22(ప్రజా జ్యోతి):**
ఆరైవ్ ఎలైవ్ అనే కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రత అవగాహన పై పోలీస్ డిపార్ట్మెంట్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరైవ్ ఎలైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం రోజున కొనరావుపేట మండల కేంద్రంలో ఎస్పీ కే ప్రశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అలాగే మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని రోడ్డుపై వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తతో వ్యవహరించాలని మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని



హెచ్చరించారు రోడ్డు భద్రత నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని తెలిపారు.

# తిర్మలాపూర్ బీట్‌లో శాకాహార జంతుగణన పూర్తి

**కొడిమ్యాల, జనవరి 22 (ప్రజాజ్యోతి):**
జగిత్యాల జిల్లా కొడిమ్యాల అటవీ రేంజ్ పరిధిలోని తిర్మలాపూర్ బీట్?లో నిర్వహిస్తున్న జంతుగణనలో తొలి దశగా శాకాహార జంతువుల గణన విజయవంతంగా పూర్తయింది. ఈ గణనలో నెమలి, కొండగొర్రె, కుందేలు, మనుబోతు, జింక తదితర శాకాహార జంతువుల సంఖ్యను నమోదు చేసినట్లు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మౌనిక తెలిపారు.జంతువుల అడుగుజాడలు, మలమూత్రం, తినుబండార ఆనవాళ్ల ఆధారంగా గణన చేపట్టినట్లు పేర్కొన్నారు. త్వరలో మాంసాహార జంతువుల గణన కూడా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్



గార్డులు, బీట్ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్,బీఆర్ఎస్, మజ్లిస్ లోపాయికారీ ఒప్పందం కేంద్ర మంత్రి బండి సంజయ్

**కరీంనగర్ బ్యూరో, జనవరి 22 (ప్రజాజ్యోతి):**
కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆరస్ పార్టీలు మజ్లిస్‌తో లోపాయికారీ ఒప్పందాలు చేసుకుని మతం పేరుతో కుట్రలు చేస్తున్నాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. తాము మాత్రం అభివృద్ధి మంత్రంతోనే ప్రజల్లోకి వెళ్తున్నామని స్పష్టం చేశారు. కేంద్ర నిధులతోనే కరీంనగర్‌లో అభివృద్ధి జరిగిందని, బీజేపీకి మేయర్ పీఠం అప్పగిస్తే మరిన్ని నిధులు తెచ్చి నగర రూపురేఖలు మారుస్తామని అన్నారు. ఇతర పార్టీలకు ఓటేస్తే అభివృద్ధి పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్, బీఆర?స్?కు చెందిన పలువురు నేతలు తమ వందలాది మంది అనుచరులతో బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారందరికీ కాషాయ కండువా కప్పి ఆహ్వానించారు.బండి సంజయ్ మాట్లాడుతూ, నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్రం ఇచ్చిన నిధులతోనే కరీంనగర్ అభివృద్ధి చెందిందని చెప్పారు. అభివృద్ధే లక్ష్యంగా ఎన్నికల్లోకి వెళు_న్నామని, సర్వేల ఆధారంగానే అభ్యర్థులకు టిక్కెట్లు ఇస్తామని తెలిపారు. గెలిచే అవకాశాలు ఉన్న చోట బీజేపీ కార్యకర్తలకే



టిక్కెట్లు ఇస్తామని, ఇందుకోసం త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామని వెల్లడించారు.కాంగ్రెస్, బీఆర?స్, మజ్లిస్ కలిసి మతతత్వంతో బీజేపీని అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నాయని ఆరోపించిన బండి సంజయ్, ఎవరు వచ్చినా బీజేపీ గెలుపు ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌పై కాషాయ జెండా ఎగరేసి తీరుతామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు గంగాడి క్రిష్ణారెడ్డి, మాజీ మేయర్ సునీల్ రావు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, పార్టీ సీనియర్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన పెట్రోల్ బంక్ ప్రారంభించిన సర్పంచ్




**చిగురు మామిడి : జనవరి 22( ప్రజాజ్యోతి):**
ముల్కనూర్ గ్రామం నుండి కొత్తపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ బంక్?ను గురువారం గ్రామ సర్పంచ్ సాంబారి భారతమ్మ కొమురయ్య ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ముల్కనూర్ గ్రామ ప్రజలకు మరియు ఈ రహదారిపై ప్రయాణించే వాహనదారులకు ఎంతో ఉపయోగపడే ఈ పెట్రోల్ బంక్ ప్రారంభం కావడం ఆనందంగా ఉంది. గ్రామానికి దగ్గరలోనే అవసరమైన సౌకర్యం అందుబాటులోకి రావడం అభివృద్ధికి సూచిక" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంతకపేట సర్పంచ్ కొయ్యడ సృజన్ కుమార్, మాజీ జడ్పీటీసీ అందే స్వామి, ఉపసర్పంచ్ వెంకటేష్, భారత్ పెట్రోల్ బంక్ యజమాని రావుల తిరుపతి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పదిలో నూరు శాతం ఫలితాలు టార్గెట్

## ప్రత్యేక తరగతుల నిర్వహణలో అలసత్వం చేయొద్దు

### జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్ బ్యూరో, జనవరి 22( ప్రజాజ్యోతి):** పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ప్రత్యేక అధికారులు దృష్టి పెట్టాలని, ప్రత్యేక తరగతుల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షల సన్నాహక సమావేశం విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగింది.



ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ప్రత్యేక అధికారులు, కేజీబీవీ, మోడల్, గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్ లు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ప్రత్యేక అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ఏ విద్యార్థికీ సెలవు ఇవ్వరాదని ఆదేశించారు. అన్ని పాఠశాలలు, కేజీబీవీలు, గురుకులాలు, మోడల్ స్కూల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి పదవ తరగతి పాస్ అవ్వడమే లక్ష్యంగా సమిష్టి కృషి చేయాలని తెలిపారు. చదువులో వెనుకబడిన పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఆ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించేలా ప్రోత్సహించాలని అన్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణలో అలసత్వం వహించినా, ప్రత్యేక అధికారులు పాఠశాల సందర్శనలో నిర్లక్ష్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్నేహిత ఫిర్యాదుల పెట్టెల తాళాలు మహిళా పోలీసులకు అప్పగించాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక సదుపాయాల అవసరాలకు నివేదిక సమర్పించాలని అన్నారు. అడిషనల్ కలెక్టర్, జిల్లా విద్యాధికారి అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ ఇంకా సిలబస్ పూర్తికాని పాఠశాలలు ఉంటే వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థుల సన్నద్ధత ప్లానింగ్ లో ఉన్న అంశాలను ఆయా పాఠశాలలు అమలు చేస్తున్నదీ లేనిదీ ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలని అన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో డిసిఇబి కార్యదర్శి భగవంతయ్య, విద్యాశాఖ కోఆర్డినేటర్లు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారమిత విద్యా సంస్థల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం

**కరీంనగర్ టౌన్, జనవరి 22 (ప్రజాజ్యోతి):** పారమిత విద్యా సంస్థల డైరెక్టర్ శ్రీమతి ఇనుగంటి ప్రసూన ప్రసాదరావు జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం కరీంనగర్ మార్కెట్ వెంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా "మీల్స్ ఆన్ వీల్స్" మానవతా సేవా కార్యక్రమం ద్వారా సుమారు 300 మందికి తాజాగా వండిన పోషకాహారాన్ని అందించారు. పేదలు, రోజువారీ వేతన కార్మికులు, వృద్ధులు, నిరాశ్రయుల ఆకలి నివారణ లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పారమిత డైరెక్టర్లు స్వయంగా భోజనం వడ్డించి సేవాభావాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో పారమిత డైరెక్టర్లు అనుకర్ రావు, లయన్ క్లబ్ నిర్వాహకులు పెద్ది విద్యాసాగర్, చైర్మన్ బోద్ల రవీందర్, ముక్కా




శరత్ కృష్ణ, శివకాంత్, బట్టు వినోద్)తో పాటు పారమిత ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# కొత్త ఇళ్ల యజమానుల మోసం కేసులో ఇద్దరు అరెస్ట్

## నగదు, మొబైల్లు, ద్విచక్ర వాహనం సీజ్

**కోనరావుపేట, జనవరి 22 (ప్రజా జ్యోతి):** కొత్త ఇళ్లు నిర్మించుకుంటున్న వారిని లక్ష్యంగా చేసుకుని ఇటుకలు, బేస్‌మెంట్ రాయి సరఫరా పేరుతో మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను కోనరావుపేట పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కోనరావుపేట పోలీస్ స్టేషన్?లో ఏఎస్పీ రుత్విక్ సాయి మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. చల్మారు గ్రామం (వీణవంక మండలం) కు చెందిన శివరాత్రి సదయ్య (60), తురకల మద్దికుంట గ్రామం (పెద్దపల్లి మండలం) కు చెందిన గాదాసు రాజయ్య (50) ఇద్దరూ కలిసి కోనరావుపేట, చందుర్తి, కథలాపూర్ మండలాల్లో ఐదుగురిని మోసం చేసి నగదు వసూలు చేసినట్లు తెలిపారు. కొత్త ఇళ్ల నిర్మాణ ప్రాంతాలను గమనించి, ముందస్తుగా డబ్బులు తీసుకుని పరారయ్యేవారని వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు చందుర్తి సీఐ జి. వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో కోనరావుపేట ఎస్సై కె. ప్రశాంత్ రెడ్డి సిబ్బందితో కలిసి నిజామాబాద్ కమాన్ వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 14,000 నగదు, రెండు నోకియా మొబైల్ ఫోన్లు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు ఛేదనలో చురుకుగా పనిచేసిన పోలీసు సిబ్బందిని అధికారులు అభినందించి రివార్డు అందజేశారు. గుర్తుతెలియని వ్యక్తులు





సరఫరాల పేరుతో డబ్బులు అడిగితే నమ్మవద్దని, వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఏఎస్పీ రుత్విక్ సాయి ప్రజలకు సూచించారు.

# కరీంనగర్‌లో కొత్త 11కేవీ ఫీడర్ బ్రేకర్ ప్రారంభం

**కరీంనగర్ టౌన్,జనవరి 22 (ప్రజాజ్యోతి):** పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో పెట్టుకుని నిరంతరాయ విద్యుత్ సరఫరా, అంతరాయాల తగ్గింపునకు గాను కరీంనగర్ టౌన్--1 సబ్ డివిజన్ పరిధిలోని టౌన్--3 సెక్షన్ బ్యాంక్ కాలనీ సబ్ స్టేషన్‌లో హిందూపూర్ కాలనీ కోసం కొత్తగా అమర్చిన 11కేవీ ఫీడర్ బ్రేకర్?ను పర్యవేక్షక ఇంజినీర్ మేక రమేష్ బాబు గురువారం ఛార్జ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజినీర్ (ఆపరేషన్) జంపాల రాజం, టౌన్--1 ఏడీఈ పంజాల శ్రీనివాస్ గౌడ్, టౌన్--3 ఏఈ వెంకట రమణతో పాటు సెక్షన్ విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



# పాడి గేదె మృతి



**చిగురుమామిడి జనవరి 22 ( ప్రజా జ్యోతి ):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడిమండల కేంద్రంలో చెరుకు రాజయ్య కు సంబంధించిన బర్రె ప్రమాదవశాత్తు చనిపోయిందనీ ,రైతు చెరుకు రాజయ్య బిరున విలపించాడు. 70 వేల రూపాయలు విలువ చేసే బర్రె ఛని పోయిందనీ, పాలు పితుకుంటూ జీవనోపాధి గడుపుకుంటున్నారని ,ప్రభుత్వం రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని రైతు బంధు మాజీ మండల అధ్యక్షుడు పెనుకుల తిరుపతి అన్నారు. ఆయన వెంట స్థానిక ఉపసర్పంచ్ విజయలక్ష్మి ,రాజు యాదవ్, పెనకుల శ్రీనివాస్ పెనుకుల సాయి కిరణ్ విజయ్ ,శ్రీకాంత్ డైరీ సూపర్వైజర్ అప్పల మల్లయ్య ,సెక్రెటరీ మల్ల శ్రీనివాస్ ,రైతులు,తదితరులు, వున్నారు.

# సమ్మక్క సారలమ్మ దేవతల కృపతో

## ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

### డీసీపీ .ఏసిపి



**కాల్వ శ్రీరాంపూర్ జనవరి 22 (ప్రజా జ్యోతి):** సమ్మక్క సారలమ్మ దేవతల కృపతో ప్రజ లంత సుఖశాంతులతో ఉండాలని పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి ఏసిపి గజ్జికృష్ణ సిఐ సుబ్బారెడ్డి ఎస్సై వెంకటేశ్వర్లు అన్నారు కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట గ్రామంలో గల సమ్మక్క సారలమ్మ జాతర పనులను వారు పరిశీలించారు వారిని పో చాల శైలజ సదానందం జాతర కమిటీ శాల్వలతో ఘనంగా సత్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతరకు వచ్చేవారు రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించి రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ గూడెం జనార్దన్ రెడ్డి కమిటీ చైర్మన్ ఉయ్యాల అశోక్ వైస్ చైర్మన్ ఉయ్యాల సాగర్ కెక్కర్ల తిరుపతి ఉయ్యాల రాజ సా భూతదితరులు పాల్గొన్నారు.

## చిన్న నీటి వనరుల గణన పరిశీలన



వీణవంక, జనవరి 21 (ప్రజాజ్యోతి)
వీణవంక మండలంలోని పల్లాపూర్ గ్రామంలో గురువారం చిన్న నీటి వనరుల గణనను జిల్లా గణాంకాధికారి వి. కిషన్ రావు మండల తహసీల్దార్ రాజమల్లుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మండలంలోని అన్ని గ్రామాల రైతులు తమ వ్యవసాయ బావులను జియో ట్రేసింగ్ చేయించేందుకు పూర్తి సహకారం అందించాలని కోరారు. అధికారులు అడిగే వ్యవసాయ బావులు, సాగు విస్తీర్ణం వంటి వివరాలనే మాత్రమే అందించాలని తెలిపారు. సర్వే పేరుతో వ్యక్తిగత వివరాలు లేదా ఓటీపీలు ఎలాంటి అధికారి అడగరని, అటువంటి సమాచారాన్ని ఎవరికి చెప్పవద్దని రైతులకు సూచించారు. ఈ సర్వే విజయవంతం కావాలంటే పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు)తో పాటు అన్ని గ్రామాల రైతులు జీపీఓలకు సహకరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రణాళికాధికారి జె. రమేష్, ఆర్ఐలు నర్సయ్య, రవి, జీపీఓ నాగమణి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లు అందజేత

**మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్**



కాల్వ శ్రీరాంపూర్ జనవరి 22 (ప్రజా జ్యోతి)
కాల్వ శ్రీరాంపూర్ మండలంలో గల కల్లు గీత కార్మికులకు కాటమయ్య కిట్లను గురువారం రోజున మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ అందజేశారు ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై చిరంజీవి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గా జన వేణ సదయ్య వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డివ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ రాజమల్లు సర్పంచులు ఆరోగ్య రమేష్ మొండయ్య తదితరులు పాల్గొన్నారు

## పత్రికా రంగంలో బాలే శివప్రసాద్ లేని లోటు తీర్చలేనిది

**ఎంపీడీవో కలికోట రామ్మోహన చారి**

కాల్వ శ్రీరాంపూర్ జనవరి 22 (ప్రజా జ్యోతి)



కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఊసన్న పల్లె గ్రామానికి చెందిన బాలే శివప్రసాద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు మృతుడి కుటుంబాన్ని ఎంపీడీవో కలికోట రామ్మోహన చారి. పరామర్శించి సంతాపం వెలబుచ్చారు .ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈయన వెంట గ్రామ సెక్రెటరీ తదితరులు ఉన్నారు.

## మల్లంపల్లిలో శ్రీకాంత్ గౌడ్ ఇంటికి వచ్చిన తీన్మార్ మల్లన్న

**- బిసి జేఏసి ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్**

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):
ములుగు జిల్లా మల్లంపల్లికి గురువారం ఎమ్మెల్సీ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న వచ్చారు.ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బిసి జేఏసి ములుగు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తోటకూరి శ్రీకాంత్ గౌడ్ స్వగృహానికి రాగా మర్యాద పూర్వకంగా కలిసి సుదీర్ఘంగా చర్చించడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న పలు ప్రజా సమస్యలు,యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, స్థానిక అభివృద్ధి అంశాలు, ప్రజాస్వామ్య విలువల పరి రక్షణ తదితర విషయాలపై చర్చించడం జరిగిందన్నారు. ప్రజల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న తీన్మార్ మల్లన్న ఆలోచనలు, సూచనలు ఎంతో ప్రోత్సాహకంగా ఉన్నాయని ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తున్న నాయకుడిగా తీన్మార్ మల్లన్న సేవలు ఉన్నాయన్నారు. భవిష్యత్ లో ప్రజాసమస్యల



పరిష్కారానికి కలిసి పని చేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేయడం జరిగింది. ఈ మర్యాదపూర్వక సమావేశం విజయవంతంగా ముగిసిందని తెలిపారు.

## హైదరాబాద్ నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలి

**నగరంపల్లి మీదుగా గుర్రంపేటకు బస్సు సర్వీస్ నడపాలి**

గణపురం ప్రజాజ్యోతి జనవరి 22 :
గతంలో నడిపిన విధంగా గణపురం హైదరాబాద్ నైట్ హాల్ట్ బస్సును పునరుద్ధరించాలని గణపురం మండల ప్రజలు ఆర్టీసీ అధికారులను కోరుతున్నారు. భూపాలపల్లి ఆర్టీసీ డిపో ఏర్పడక ముందు పరకాల డిపో నుండి ఎక్స్ ప్రెస్ బస్సు సర్వీసు హనుమకొండ కు వెళ్లి రాత్రి 9 గంటల తర్వాత పరకాల రేగొండ, గాంధీనగర్ మీదుగా గణపురం చేరుకొని ఇక్కడే నైట్ హాల్ట్ చేసి తిరిగి ఉదయం 5 గంటలకు జంగాలపల్లి ములుగు హనుమకొండ మీదుగా హైదరాబాద్ వెళ్ళేది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఉదయం గణపురం చేరుకొని నైట్ హాల్ట్ బస్సులో వెళ్లేవారు. కొద్దిరోజులపాటు భూపాలపల్లి డిపో నుండి కూడా అప్పటి స్పీకర్ మధుసూదనాచారి చొరవతో ఉదయం వేళ హైదరాబాద్ బస్సు సర్వీసును నడిపించారు. అనంతరం టార్గెట్ రావడంలేదని



బస్సును రద్దు చేశారు. పారిశ్రామిక ప్రాంతమైన గణపురం మండల కేంద్రం నుండి కనీసం ఒక్క ఎక్స్ ప్రెస్ ఆర్టీసీ బస్సు కూడా లేకపోవడం పట్ల మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గతంలో పరకాల డిపో నుండి వెల్తుర్లపల్లి క్రాస్ మీదుగా కొండాపూర్ గుర్రంపేటకు ఆర్డినరీ బస్సు వెళ్ళేది ఆ బస్సునుకూడా రద్దు చేయడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గుర్రంపేటకు వెళ్లే బస్సును పునరుద్ధరిస్తూ నగరంపల్లి అప్పయ్యపల్లి మీదుగా కొండాపురం గుర్రంపేట వెళ్లే విధంగా బస్సు సర్వీసును కొనసాగించాలని వాగవతలి గ్రామాల ప్రజలు కోరుతున్నారు. హైదరాబాద్ నైట్ హాల్ట్ బస్సును తిరిగి ఉదయం 5 గంటలకు వెళ్లే విధంగా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## సూర్య దినపత్రిక 2026 క్యాలెండర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్

జనగామ జిల్లా ప్రతినిధి, జనవరి 22 (ప్రజాజ్యోతి) :
సూర్య దినపత్రిక 2026 నూతన సంవత్సర క్యాలెండర్ ను , డైరీ ని గురువారం జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఐఏఎస్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సూర్య దినపత్రిక మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రజాస్వామ్యంలో పత్రికల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యలను ప్రభుత్వానికి చేరవేస్తూ, ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సూర్య దినపత్రిక విశేష కృషి చేస్తోందని ప్రశంసించారు. నిష్పక్షపాతమైన వార్తలతో ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకున్న సూర్య దినపత్రిక



భవిష్యత్తులో మరింత ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సూర్య దినపత్రిక ఉమ్మడి వరంగల్ జిల్లా బ్యూరో చీఫ్ పురుషోత్తం జనగామ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ చేల్పోజు నవీన్ చారి దేవరుప్పుల మండల రిపోర్టర్ భాషిపాక ఎల్లేష్ లింగాల ఘనపూర్ మండల రిపోర్టర్ గన్ను కార్తీక్ బచ్చన్నపేట మండల రిపోర్టర్ అల్వాల రాజు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై విద్యార్థులకు క్విజ్ వ్యాసరచన పోటీలు

ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):
ములుగు జిల్లా కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్విజ్ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీ బాలికల పాఠశాలలో రోడ్డు భద్రత పట్ల ట్రాఫిక్ నియమాల గురించి, వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేయడం జరిగింది. అనంతరం జడ్పీ బాలికల పాఠశాలలో వ్యాస



రచన,క్విజ్ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర ఫోటో ముద్రణతో కూడిన నోట్ బుక్స్ బహూకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా రవాణా శాఖ అధికారులు బారగాడి శ్రీనివాస్,వై. వినోద్‌రెడ్డి,ములుగుజిల్లావిద్యాశాఖఅధికారిసిద్ధార్థరెడ్డి ,సిబ్బంది,ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.